


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సోహం

**"ఒక్కరే వచ్చారా?"** హిందీలో వినపడిన ఆ ప్రశ్నకి మైత్రేయి తలతిప్పి చూసింది.

చైనీస్ పోలికలతో ఉన్న ఓ అమ్మాయి వెడల్పాటి ముఖం ఇంకా వెడల్పు చేసి నవ్వుతోంది.

"అవును. అందుకే ఇక్కడ రూం దొరకడం కష్టమైంది" మైత్రేయి కూడా నవ్వుతూ చెప్పింది.

"ఎక్కడినించి వచ్చారు?" ఆ అమ్మాయి అడిగిండ్.

"ఆంధ్రప్రదేశ్‌నించి. సారీ. నాకు హిందీ అంతగా రాదు" మైత్రేయి ఇబ్బందిగా చెప్పింది.

ఆ అమ్మాయి అది పట్టించుకోనట్లుగా అడిగింది.

"అదెక్కడుంది?"

"సౌత్‌లో"

ఆ అమ్మాయి చిన్న కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"అంతదూరంనించి వచ్చారా? అంతా సిమ్లా వెళ్తారు కాని ఈ చిన్న ఊరికి రారు. ఫారినర్స్ సౌతిండియన్స్ కన్నా ఎక్కువగా వస్తారు" చక్కటి ఏక్సెంట్‌తో ఇంగ్లీష్‌లో చెప్పింది.

"నీకు ఇంగ్లీష్ వచ్చా?" ఈసారి మైత్రేయి ఆశ్చర్యపోయింది.

"ఇక్కడున్న చిన్నపిల్లలకి కూడా వచ్చు. ఫారినర్స్‌తో మేం ఇంగ్లీష్‌లోనే మాట్లాడాలి కదా?"

"ఇంతకీ నన్నెందుకు పలకరించావు?" మైత్రేయి ఆలోచనగా అడిగింది.

"నా పేరు సౌపర్ణి. టూరిస్ట్‌లని మా చిన్న ఇన్‌కి భోజనానికి పిలవడానికి ఇక్కడ వేచి వుంటాను. మీరొక్కరే కనపడితే అడిగాను."

"చక్కటిపేరు. నువ్వూ బావున్నావు. నా పేరు మైత్రేయి" చెప్పింది.

"మీరు శాకాహారా? మాంసాహారా?" సౌపర్ణి అడిగింది.

"శాకాహారినే. మీరు వెజిటేరియన్ సర్వ్ చేస్తారా?"

"మాకు మంచి కూరగాయలు, పళ్ళూ పండుతాయి. మీ రుచులు మాకు తెలీవు కానీ మా రుచుల్లో నేనే మీకు వండిపెడతాను" సౌపర్ణి చెప్పింది.

"అలాగే. నాకు టూర్‌గైడ్‌గా కూడా ఉంటావా?" మైత్రేయి బేరమాడకుండా అడిగింది.

సౌపర్ణి గలగల నవ్వింది.

"మా బరోగ్ చాలా చిన్న ఊరు. మీకు ఎవరి సాయం అక్కర్లేదు. చక్కగా నడుచుకుంటూ వెళ్ళడమే."

"సరే. గంట తర్వాత మళ్ళీ ఇక్కడికే వస్తాను. ఆ టైం సరిపోతుందా?" మైత్రేయి అడిగింది.

"ఎక్కువ. జాగ్రత్త. వంటరిగా ఉన్నారు. జన సంచారం ఉన్న చోట్లే తిరగండి" హెచ్చరించి సౌపర్ణి వెళ్ళిపోయింది.

మైతేయి పచ్చటి గడ్డిమీద నడుస్తూ ఆ అందమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ ముందుకి సాగింది.

చపాతీలో ఉప్పూకారం ఎక్కువగా లేని ఆ వేయించిన కూరగాయముక్కలని తిని, తనవంక ఆత్రంగా చూస్తున్న సౌపర్ణితో చెప్పింది.

"చాలా బాగుంది. నేను ఇక్కడ ఉన్నన్నాళ్ళూ నీ చేతివంటే తింటాను"

ఆ అభినందనలకి సౌపర్ణి ఆనందపడిపోయి అడిగింది.

"ఎన్నిరోజులుంటారు?"

"ఏమో?"

"ఏమో?" సౌపర్ణి ఆశ్చర్యంగా అడిగింది.

"రిటన్ టిక్కెట్ చూపించడానికి ఇదేం విదేశం కాదుగా!" మైత్రేయి తేలిగ్గా నవ్వుతూ చెప్పింది.

"టూరిజం అంటే ప్లాన్ చేసుకుని వస్తారుగా అంతా. అందుకని.. ఏమీ అనుకోవద్దు" క్షమాపణగా చెప్పింది.

"ఏమీ అనుకోలేదు. నేనిక రూముకి వెళ్ళి రెస్ట్ తీసుకుని సాయంత్రం మళ్ళీ వస్తాను" చెప్పి మైత్రేయి లేచింది.

మైత్రేయి తనని దాటి ముందుకెళ్ళిన జంటవైపు ఆసక్తిగా చూసింది. అతని చెయ్యి ఆమె నడుం చుట్టూ వేసి నడుస్తున్నాడు. ఆమె తలని అతని భుజం మీద వాల్చి నవ్వుతూ ఏదో చెప్తోంది. అతనూ నవ్వుతూ వింటున్నాడు.

మైత్రేయికి వాళ్ళని చూస్తే ముచ్చటేసింది. చిన్నపిల్లలు. హనీమూన్‌కి వచ్చినట్లున్నారు. ఈ ప్రపంచంతో సంబంధం లేదన్నట్లు నడుస్తున్నారు. మైత్రేయి వేగంగా నడిచి వాళ్ళని దాటి కొండ అంచుకి వెళ్ళింది. కింది లోయ కనపడకుండా పొగమంచు కప్పేసింది. మేఘాలు చేతికి అందేలా ప్రయాణిస్తున్నాయి. వాటినించి వస్తున్న చల్లదనాన్ని కళ్ళు మూసుకుని ఆస్వాదిస్తుండిపోయింది.

సూర్యుడు ఎర్రబడ్డాడు. చలి ఎక్కువై చుట్టుపక్కల జనాలు నెమ్మదిగా వెళ్ళిపోతున్నారు. మైత్రేయి కూడా వెనుతిరిగింది. దారిలో ఏవో మాటలు వినపడి తల తిప్పి చూసింది. ఆ జంట కాలిబాట పక్కనున్న పచ్చికలో ఓ వృక్షం కింద నిలబడి ఉన్నారు. అతను ఏదో భాషలో కటువుగా మాట్లాడుతున్నాడు. ఆ అమ్మాయి తల వంచుకుని కాలితో గడ్డిలో ఏదో వెదుకుతోంది. అతని స్వరం పెరిగింది. భాష అర్థంకాకపోవడంతో ఏం జరుగుతోందో మైత్రేయికి అర్థంకాలేదు. అరగంట క్రితం అంత ఆనందంగా కనిపించారు. ఇంతలో ఏమైంది అనుకుంది. ఆ అమ్మాయి ఇక లాభం లేదనట్లు కింద కూర్చుని ఆరెంజ్ రంగు నెయిల్ ఎనామిల్ వేసిన అందమైన చేతులతో గడ్డిలో వెదకసాగింది. రెండు నిమిషాల్లో ఆమె విజయగర్వంతో లేచి నుంచుంది. మట్టి అంటుకున్న ఆమె చేతిలో చెవికి పెట్టుకునే షాండ్లియర్‌లా ఉన్న పెద్ద ఝుంకా ఉంది.

అది చూడగానే ఆ అబ్బాయి మాట్లాడడం ఆపి ఆమె దగ్గరకి వచ్చి మృదువుగా ఏదో చెప్పాడు.

ఆమె ఓ క్షణం ఆలోచించి రెండో చెవికి ఉన్న ఆభరణాన్ని కూడా తీసి రెంటినీ హేండ్ బాగ్‌లో పెట్టింది.

అతను ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి నడకసాగించాడు. ఆమె ఈసారి అతని భుజం మీద ఒరగలేదు. నిటారుగా నడిచింది. నీళ్ళు నిండిన ఆమె కళ్ళలో రోషం తళతళ మెరిసింది.

మైత్రేయి మనసు వికలమైంది. పిచ్చి తల్లి! ఎంత ఇష్టంగా పెళ్ళిచేసుకుని ఉంటుంది? ఎంత శ్రద్ధగా తయారైంది అతనికోసం? అన్నీ నాశనమైపోయయి. కటువైన పదాలు  వాడాడేమో! ఖరీదైన ఆభరణమే కావచ్చు. కానీ కావాలని ఎవరూ ఏదీ పోగొట్టరు కదా? తనూ వెతకచ్చుకూడా. కాని కదలకుండా నుంచుని మందలించాడు. ఇలాంటివాడితో ఆ అమ్మాయి ఎంత అప్రమత్తంగా మెలగాలి? పాము పడగలో కప్ప కాపురమై పోదూ?

మగాడికి అన్ని కంఫర్ట్స్ అందించి, అతను చెప్పినట్లు వింటే అంత మంచివాడు ఇంకొకడు ఉండడు. చిన్న అసౌకర్యం కలిగినా భర్త బయటకి వస్తాడు అనుకుంది. మైత్రేయికి దిగులేసింది.

ఆ రాత్రి భోజనం అయ్యాక మైత్రేయి సౌపర్ణి ఇంటిపక్కనే ఉన్న కాలిబాటమీద నడుస్తూ 'ఇంట్లో అంతా ఏం చేస్తున్నారో' అనుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా తన గదివైపు సాగిపోయింది. ఆమెకి చాలా ప్రశాంతంగా నిద్రపట్టింది.

"దీదీ. ఓ మాట పడుగుతాను. తప్పుగా అనుకోవుగా?" పని హడావిడిలేని ఓ సాయంత్రం పూట సౌపర్ణి బెరుగ్గా అడిగింది.

"లేదు. అడుగు" ఆమె ఏం అడగబోతోందో అర్థమైన మైత్రేయి హామీ ఇచ్చింది.

"నీకు ఎవరూ లేరా?"

"ఎవరూ అంటే భర్తా?"

"అంటే.. కుటుంబం."

"చాలా మంది ఉన్నారు. అమ్మా, నాన్నా, చెల్లి, భర్త, కూతురు,కొడుకు, అత్తగారు, ఇంకా అటువైపు చుట్టాలు..." మైత్రేయి వేళ్ళ మీద లెక్కపెడుతూ నవ్వింది.

సౌపర్ణి కూడా నవ్వి అడిగింది.

"అంత పెద్ద పరివారం ఉండీ నిన్నొక్కదన్నే పంపిందా? ఎవరూ తోడు రాలేదా?"

"అదే వాటి గురించి ఆలోచిద్దామనే వచ్చాను."

"అంటే?"

"నా వయసులోని ఒక మగవాడు ఇలా నీకు తటస్థపడితే ఈ ప్రశ్నలు అడిగేదానివా?"

"ఏ ప్రశ్నలు?" సౌపర్ణి అయోమయంగా అడిగింది.

"ఒక్కడినే ఎలా పంపారు? ఎవరూ తోడు రాలేదా?"

"మగమహారాజు. తోడు ఎందుకు? పర్మిషన్ అసలు అవసరంలేదు."

"మొన్నటిదాకా నేనూ నీలాగే ఉండేదాన్ని. నా ఏభయ్యవ పుట్టినరోజునాడు నాకో జ్ఞానోదయమైంది. సిద్ధార్థుడిలాగా దాన్ని అన్వేషిస్తూ వచ్చాను."

"దీదీ. రేపు పుట్టగొడుగులతో మంచి కర్రీ చేస్తాను. నువ్వు మష్రూం తింటావుగా?" సౌపర్ణి మాట మార్చింది.

"ఏదైనా పర్లేదు" చెప్పి మైత్రేయి ముందుకి సాగిపోయింది.

కొండమీద మనుషులకి దూరంగా పేరు తెలీని పూలచెట్టు కింద పచ్చటి పచ్చికలో పడుకుని అస్తమిస్తున్న ఆకాశంలోకి చూస్తున్న మైత్రేయి మనసు ప్రశాంతంగా ఉంది. ఆమెలో ప్రతీకారంలేదు. అలా అని ఆత్మన్యూనతా భావంకూడా లేదు.

మొన్నటిదాకా మైత్రేయి మంచి ఇల్లాలు. మంచి తల్లి. మంచి కూతురు, మంచి కోడలు. మంచి.. మంచి..మంచి.

ఈ మంచితనంతో ఆమె అలసిపోయింది. ఎంతకాలం వీళ్ళందర్నీ మంచిగా తృప్తిపరచాలి? తను పుట్టింది అందుకేనా అన్న ప్రశ్న వచ్చినప్పుడు ఆమె అశాంతికి గురైంది.

ఆ తర్వాత కుటుంబ సభ్యులని నిశితంగా పరిశీలించడం మొదలుపెట్టింది.

ఆరోజు మైత్రేయి ఏభయ్యో పుట్టినరోజు. కుటుంబ సభ్యులవరకు లంచ్ ఇద్దామని భర్త అన్నప్పుడు, తను, అతను, పిల్లలిద్దరూ దగ్గరలోని రిసార్ట్‌కో, రెస్టొరెంట్‌కో, వెళ్తే బావుండు అనుకున్నా కూడా అతన్ని నొప్పించకూడదని సరేనని తలూపింది.

మైత్రేయి తల్లిదండ్రులు చెప్పినట్లు బుద్ధిగా చదువుకుంది. మంచి ఉద్యోగంలో చేరింది. వాళ్ళు చూపించిన అబ్బాయిని పెళ్ళిచేసుకుంది. మామగారు లేరుకాబట్టి అత్తగారు ఇంట్లోనే ఉంటారు. ఆవిడ సౌకర్యాలు చూసేది. ఆవిడ కోసం ప్రత్యేకంగా ఓ మెయిడ్‌ని పెట్టింది. రోజూ ఆఫీస్‌కి వెళ్ళేప్పుడు 'వెళ్ళొస్తా అత్తయ్యా' అని చెప్తుంది. ఆవిడ తలూపి 'జాగ్రత్తమ్మా' అంటుంది. ఇది నిత్యకృత్యం. మైత్రేయి తనకి నచ్చినట్లు ఖర్చుపెట్టుకుంటుంది. ఐనా నెలాఖరుకి ఆమె అకౌంట్‌లో చాలా డబ్బు మిగులుతుంది. ఐదారు నెలలకోసారి భర్తదాన్ని ఇన్వెస్ట్ చేస్తాడు. దాన్నామె పట్టించుకోదు. ఒక్కోసారి అతను అసంతృప్తిగా చెప్తాడు. 'ఈ నెల్లో చాలా ఖర్చు పెట్టావు'" అని.

నా డబ్బు, నా ఇష్టం అనదు. లేదా నేను నీ అకౌంట్ చెక్ చేస్తున్నానా? నువ్వెందుకు చేస్తారని కూడా అడగదు. చిరునవ్వుతో 'అవునా?' అనేసి వెళ్ళిపోతుంది.

ఉద్యోగం చెయ్యని చెల్లెలు ఒక్కోసారి 'అక్కా పదివేలు పంపవే' అని ఫోన్ చేస్తూంటుంది. 'సరే' అని పంపుతుంది కాని 'ఎందుకు?' అని అడగదు.

పిల్లల చదువు విషయంలో కఠినంగా ఉండి, మామూలుగ ఫ్రెండ్లీగా ఉండి వాళ్ళని ఓ స్థాయికి తెచ్చింది. భర్త ఎవరికైనా మాపిల్లలు... అంటూ వాళ్ళ చదువుగురించి గర్వంగా చెప్తూంటే, చిరునవ్వుతో వింటూంటుంది కాని తన పాత్ర గురించి చెప్పదు.

ఆ రోజు గొడవ వసంత వల్ల మొదలైంది. వసంత మైత్రేయి ఏకైక ఆడపడుచు. భర్త చెల్లెలు. ఆమెకి మైత్రి అంటే అసూయ. కోడల్ని పొగిడే తల్లి, భార్యని దేవతగా చూసే అన్న, మంచి ఇన్స్టిట్యూషన్స్ లో చదివే అన్న పిల్లలు. డైరెక్టర్ పొజిషన్‌లో లక్షలు సంపాదిస్తున్న వదిన.. ఆ ఉక్రోషాన్ని వసంత అణచుకోలేదు. సమ వయస్కురాలైన వసంతతో స్నేహంగా ఉందామని ప్రయత్నించినా ఆమె దూరంగా పెట్టడంతో మైత్రి కూడా దూరంగా ఉంటుంది.

లంచ్ పూర్తయింది. అంతా హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. డైనింగ్ టేబుల్ సర్దుతున్న మైత్రేయికి వరండాలో తన కొడుకుతో వసంత కొడుకు మాట్లాడే మాటలు వినిపించాయి.

"మా నాన్న ఎంత నసగాడంటే నా ఫ్రెండ్స్ ఇంటికి రావడం మానేసార్రా. 'బి వేర్ ఆఫ్ డాగ్‌లాగ నువ్వు బి వేర్ ఆఫ్ డేడ్' అని బోర్డ్ పెట్టాలిరా అంటున్నారు. ఆయన గోల భరించలేకపోతున్నా. ఇంటికి ఎవరైనా వస్తే చాలు వచ్చి

కూర్చుంటారు. నా ఫ్రెండ్స్‌తో అజీర్ణాలు, గేస్, అసిడిటిటీ అంటూ మాట్లాడతారు. వాళ్ళు నా మొహం చూస్తుంటారు..." వాడు చెప్పుకుపోతున్నాడు.

మైత్రేయికి ఆ మాటలు నచ్చలేదు. తండ్రిగురించి చెడ్డగా చెప్తాడేంటీ? తన కొడుకు ఆ మాటలకి ఇన్‌ఫ్లూయన్స్ అయితే? అన్న ఆలోచనతో వరండాలోకి వెళ్ళి చెప్పింది.

"తప్పు దీపూ. నాన్న ఎంత చేస్తే నువ్వు ఇంతవాడివయ్యావు ఆయన్నలా హేళన చేయొద్దు."

"టార్చరత్తా. వీడి ఫ్రెండ్స్ వస్తే మామయ్య 'హలో' చెప్పి లోపలికి వెళ్ళిపోతారు. నువ్వూ అంతే. మా నాన్న వాళ్ళు వెళ్ళేదాకా అక్కడే కూర్చుంటాడు. మేం ఏం మాట్లాడుకోగలం చెప్పు. ఇంక మా అమ్మ 'వాడిని చూసి బుద్ధి తెచ్చుకో, వీడిని చూసి జ్ఞానం తెచ్చుకో' అని వాళ్ళముందే అంటుంది. నాకెలా ఉంటుంది?" దీపూ తన గోడు చెప్పాడు.

ఆ మాటలు విన్న వసంత 'నా కొడుకుని ఎందుకు వదినా? నన్ను అడిగితే చెప్తాగా  మా ఇంటి సంగతులు' అని పెద్ద గొంతుతో అరుస్తూ హాల్లోకి వెళ్ళింది.

తల్లి దగ్గర కూర్చుని మైత్రి తన గురించి, తన భర్తగురించి దీపూకి చెడ్డగా నూరిపోస్తోందని ఏడవడం మొదలు పెట్టింది.

మైత్రేయి నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. ఆమెకి ఎవరైనా పెద్దగా మాట్లాడితే వణుకు వస్తుంది. అలాంటిది ఆడపడుచు అంత పెద్ద గొంతుతో, ఉక్రోషాన్నంతా వెళ్ళగక్కుతూ అరుస్తూంటే ఆమెకి ఏం చేయాలో అర్ధంకాలేదు.

"నీకెందుకమ్మా అందరి సంగతులూ" అంటూ తల్లితండ్రులు లేచి వెళ్ళిపోయారు.

"వాడినెందుకు అడిగావక్కా? ఆ తల్లి కొడుకు కదూ? ఎనీవే. హేపీ బర్త్‌డే.  వస్తా" చెప్పి చెల్లి వెళ్ళిపోయింది.

"ఏంటమ్మా ఇంట్లో ఈ న్యూసెన్స్? ఎవరెట్లా పోతే నీకేంటి?" కొడుకు కోపంగా చెప్పి తనగదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

"నీకు చాదస్తం ఎక్కువైందమ్మా" కూతురు ఫోన్‌లోంచి తలెత్తి చెప్పింది.

"సారీ అత్తా" చెప్పి దీపూ బాధగా బయటకి వెళ్ళిపోయాడు.

"ఉరుకోమ్మా. ఆవిడ పెద్ద ఉద్యోగం చేస్తోందిగా నన్ను ఎవరేమంటారని ధీమా" అత్తగారు కూతుర్ని సముదాయించింది.

"చేసినదంతా చేసి ఇంకా రాయిలాగా నుంచుంటావే. ఫో. లోపలకి" భర్త గర్జించాడు.

కాళ్ళూ చేతులు గజగజ వణుకుతూంటే మైత్రేయ ఒక్క పరుగున పడకగదిలోకి వచ్చి మంచం మీద పడింది. అవమానంతో ఆమె మొహం ఎర్రబడింది. బయట అత్తగారు, ఆడపడుచు భర్తతో చెప్పే మాటలు వినపడుతున్నాయి.

కొత్త చీర అసౌకర్యంగా గరగరలాడుతూంటే విప్పి ఓ మూలకి విసిరేసింది. అలాగే పడుకుని ఆలోచించసాగింది. ఆలోచిస్తూంటే ఆమెకి ఆశ్చర్యంగా ఉంది. ఏమైంది అని ఎవరూ తనని అడగలేదు. మైత్రి అలాంటిది కాదు అని ఒక్కళ్ళుకూడా అనలేదు. వసంత చెప్పింది అంతా నమ్మారు. తన తల్లితండ్రులతో సహా! మరి ఎందుకీ మంచితనం? ఏభై ఏళ్ళుగా తల్లి తండ్రులతో, పాతికేళ్ళుగా భర్తతో మెలిగిన మంచితనమంతా ఒక్క ఆరోపణతో కొట్టుకుపోయింది.

ఆలోచిస్తూంటే మైత్రేయికి తనెంత అవివేకో అర్ధమవసాగింది. ఎంత ఆప్యాయంగా చూసినా, మందులు తేవడం మర్చిపోతేనో, ఇంట్లో పళ్ళూ, స్వీట్స్ లేకపోతేనో అత్తగారు అరపూట మాట్లాడదు. తను పశ్చాత్తాపంతో కుమిలిపోతూ ఆవిడ వెంటపడితే రెండోపూటకి మామూలయ్యేది. కొడుకుని అడగదు. ఆయన తేడు. ఈ ప్రతాపమంతా తనమీదే. కూతురు కోరిన కంఫర్ట్స్ ఉంటే, 'మా అమ్మ బంగారం' అంటూ, అటు పోతూ, ఇటు వస్తూ ముద్దులుపెడుతుంది. ఒక్క అసౌకర్యం  ఎదురైనా 'ఛీ నువ్వింతే' అని నేలని తంతు వెళ్ళిపోతుంది. అక్కడి సంభాషణ మొత్తం విన్న కొడుకు నీకెందుకమ్మా అన్నాడు తప్ప అమ్మ ఉద్దేశం అదికాదు అని చెప్పలేకపోయాడు. భర్త! తన పక్షం మాట్లాడకపోగా, పనివాళ్ళముందు అంత పెద్దగా అరిచాడు. సాటి మనిషిని, భార్యని అరవడానికి ఆయనకి అంత చులకన భావం ఉందా తనమీద? తర్వాత అతనితో తను మామూలుగా ఉండగలదా?

అర్ధరాత్రి ఆకలికి మెలకువ వచ్చినా మైత్రేయి లేచి బయటికి వెళ్ళలేదు. మర్నాడు పొద్దున లేచి ఎవరితో మాట్లాడకుండా ఆఫీస్‌కి వెళ్ళిపోయింది. ఆమెకి ఈ మంచితనాలకి దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపోవాలి అని బలీయంగా అనిపించింది. పెళ్ళికాకముందు మైత్రేయి బరోగ్ గురించి విని హనీమూన్‌కి అక్కడికి వెళ్ళాలి అనుకుంది. సిమ్లానించి టాయ్‌ట్రైన్‌లో ప్రయాణం, జనసంచారం ఎక్కువలేని హిల్‌స్టేషన్‌లో గడపడం ఎంత రొమేంటిక్‌గా ఉంటాయి అనుకునేది. భర్తతో ఆ మాట చెపితే, అతను తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"వద్దు. అమ్మ వంటరిగా ఉంటుంది. అదీగాక నాకు తోచదు. చెట్లు, పుట్టలు చూడడమంటే పరమ బోర్."

మళ్ళీ ఇన్నాళ్ళకి ఆమెకి బరోగ్ గుర్తొచ్చింది. అకౌంట్‌లో ఎంతుందో చూసింది. రెండులక్షల చిల్లర. ఫస్ట్ మరో పది రోజులుంది. ఆ రోజు లీవ్ అప్లై చేసి టిక్కెట్స్ చూసింది. కొంచెం ఎక్కువే ఉన్నా కొనేసింది.

మధ్యాహ్నం హోటల్‌లో భోజనం చేసి ఆఫీస్ కారులో ఇంటికి వచ్చింది. అత్తగారు వంటమనిషి మాత్రమే ఉన్నారు. ఎవరితో మాట్లాడకుండా సూట్‌కేస్ సర్దుకుని ఏర్‌పోర్ట్‌కి బయలుదేరింది.

వాట్సప్ ఫేమిలీ గ్రూప్‌లో తను ఊరెళ్తున్నట్లు మెసేజ్ చేసింది. భర్తకి ప్రైవేట్ గా  తన ఎకౌంటులో డబ్బు తీయవద్దని, తనకి అవసరమని మెసేజ్ చేసింది. దేనికీ సమాధానం లేదు. సిమ్లా నించి టాయ్ ట్రైన్‌లో బరోగ్‌లో దిగింది. ఆ ఊళ్ళో హోటల్స్‌లో  ఒక్కరికి రూం ఇవ్వరట. ప్రతి హోటల్లో అదే చెప్పారు.  కారణం, ఆ అందమైన ప్రకృతిని చూసి ఆత్మహత్య చేసుకుంటారని భయమట. తన ఐడి కార్డ్ చూపిస్తే యూరోపియన్ నడిపే ఓ చిన్న మోటెల్‌లో గది దొరికింది.

"ఇక్కడ వైఫై ఉందా?" మోటెల్ యజమానిని అడిగింది.

అతను తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"లేదు. ఫోన్ సిగ్నల్సే సరిగ్గా రావు. ఏర్‌టెల్ కార్డ్ తీసుకోండి. స్పీడ్ తక్కువున్నా పర్లేదు. పనిచేస్తుంది."

అతని సూచన ప్రకారం కార్డ్ కొని లేప్‌టాప్ ఆన్ చేసింది మరో పదిరోజులు లీవ్ ఎక్స్‌టెండ్ చేసింది. అకౌంట్‌లో డబ్బు అలాగే ఉంది. భర్త, పిల్లలనించి సారీ చెప్తూ మెసేజెస్ ఆశించింది కాని ఏమీలేవేమీ లేవు. 'అక్కా అర్జెంట్‌గా పదిహేనువేలు ట్రాన్స్‌ఫర్ చెయ్' అన్న చెల్లి మెసేజ్ మాత్రం కనబడింది. దాన్ని డిలీట్ చేసింది. ఇరవైరోజులదాకా నా ప్రపంచంలో నేనే ఉంటాను" అనుకుంది.

***

కొంచెం చనువు పెరిగాక సౌపర్ణిని అడిగింది.

"నువ్వూ, ఈ ఇద్దరు కుర్రాళ్ళు తప్ప ఇంకెవరూ కనపడటంలేదు. నీ కుటుంబం ఎక్కడా?"

సౌపర్ణి మొహంలో నీలినీడలు.

"మా ఆయనకి నేనంటే చాలా ఇష్టం. ప్రేమ. కోరి నన్ను పెళ్ళిచేసుకున్నాడు. కాని పరమ బద్ధకస్తుడు. కుదురులేదు. ఏ ఉద్యోగంలోనూ రెండు నెలలు మించి పనిచేయలేదు. మరి ప్రేమ కడుపు నింపదుగా? దీదీ. అందుకే ఇలా టూరిస్ట్‌లకి ఆర్డర్ ప్రకారం వండి పెడుతూంటా. ఆయన వెనక గదిలో టి.వి చూస్తూంటాడు. బుద్ధి కుదిరిన రోజు క్లీనింగ్‌కి సహాయం చేస్తాడు. అంతే. అప్పుడప్పుడూ ఏడుస్తాడు. ఏం చేస్తాను? వాడే పెళ్ళాం, నేనే మొగుడు అనుకుంటా" చెప్పింది.

"పిల్లలు?"

"ఇద్దరబ్బాయిలు. సిమ్లాలో ఉంటారు. ఏవో చిన్న పనులు చేసుకుంటారు. వాళ్ళ నాన్న పోలిక రాలేదు. నాలాగా శ్రమ జీవులు. ఇక్కడ ఉంటే నా సంపాదన చాలదని వలసపోయారు" బాధగా చెప్పింది.

"నువ్వు గ్రేట్ సౌపర్ణీ. ఏదీ మీ హీరోని చూపించు" ఆమె మూడ్ మారడం కోసం మైత్రేయి నవ్వుతూ అడిగింది.

"పిలుస్తాను కానీ దీదీ ఆయన్ని తక్కువ చేసి మాట్లాడకండి. చిన్నబుచ్చుకుంటాడు" హెచ్చరించి లోపలున్న భర్తని పిలిచింది.

అతను తొంగి చూసి, నిమిషం తర్వాత షర్ట్ వేసుకుని వచ్చాడు.

"ఈ దీదీ సౌత్ నించి వచ్చింది. మన దగ్గరే భోంచేస్తోంది. నిన్ను చూడాలంటే పిలిచా" సౌపర్ణి మృదువుగా చెప్పింది.

అతను సిగ్గుగా నవ్వాడు. దాదాపు నలభై ఐదేళ్ళ వయసున్న అతనికి చైనా పోలికలు అంతగా లేవు. అందంగా ఉన్నాడు.

"రాజేష్ ఖన్నాలా ఉన్నావు" మైత్రేయి చనువుగా చెప్పింది.

అతను మరింత సిగ్గుపడ్డాడు.

"వెళ్ళి నీ పని చేసుకో. సౌపర్ణి భర్త ఎలా ఉంటాడా అని కుతూహలంతో అడిగా. ఇద్దరి జంటా బాగుంది" మైత్రేయి అభినందనగా చెప్పింది.

మోటెల్‌కి వెళ్తూ ఆలోచించింది.

"ప్రేమకెంత పవర్ ఉంది? ప్రేమకి లొంగి సౌపర్ణి భర్తని కూర్చోపెట్టి పోషిస్తూంటే, మొన్నటి హనీమూన్ జంటలోని అబ్బాయి పెళ్ళయి ఎంతో కాలం కాకుండానే భార్య మనసుని బాధపెట్టాడు. ఏమో ఆమె ప్రేమకి లొంగిపోయి మారిపోతాడేమో!" ఆశావహంగా అనుకుంది.

"దీదీ. ఇంట్లో దెబ్బలాడి వచ్చావా? అంకుల్‌జీ నిన్ను అరవరా ఇన్ని రోజులు ఇలా ఉంటే? ఫోన్ చేస్తున్నావా ఇంటికి?" సౌపర్ణి సంశయంగా అడిగింది.

"అన్నిటికీ సమాధానం నో" మైత్రేయి చెప్పింది.

సందేహాలున్నా స్థాయికాదు కాబట్టి సౌపర్ణి మౌనంగా ఉండిపోయింది.

"నా కథ చెప్పనా? తప్పు ఎవరిదో చెప్తావా?"

"నేనంత గొప్పదాన్నికాదు దీదీ."

"అదేం గొప్ప కథ కాదులే..."

మైత్రేయి చెప్పినదంతా సౌపర్ణి శ్రద్ధగా విన్నది. తర్వాత చెప్పింది.

"నువ్వు తప్ప అంతా తప్పు చేసారు దీదీ."

"కదా? అందుకే కొన్నిరోజులు వాళ్ళని చూడకూడదని వచ్చాను. తొందరలోనే వెళ్ళిపోతాను" మైత్రేయి చెప్పింది.

ఆ రాత్రి పడుకున్నాక ఆలోచించింది. తన పుట్టినరోజు నాటి రాత్రి గుర్తొచ్చింది. ఎంతవేదన! ఎంత బాధ! ఎంత కోపం.

చాలా అనుకుంది. వసంతని ఇంటికి రానివ్వకూడదని, భర్తకి విడాకులు ఇవ్వాలని, పిల్లలని పట్టించుకోకూడదని, పేరెంట్స్‌తో పలకకూడదని, ఆత్మహత్య చేసుకోవాలని..

ఆనాటి బాధ అన్ని పరిష్కారాలని చూపించింది. ఇప్పుడు ఆలోచిస్తే, శాంతపడిన మనసు మరికొన్ని పరిష్కారాలు చూపచ్చు.

మైత్రేయి మైత్రేయిలాగే ఉండాలి. వాళ్ళకోసం తన ఒరిజినాలిటీని పోగొట్టుకోకూడదు. ఈ మంచితనాన్ని, సంస్కారాన్ని పోగొట్టుకోకూడదు. పెద్దగా అరవడం, గగ్గోలు పెట్టడంలాంటివి వసంత సంస్కారం. దాన్ని తాను అలవాటు

చేసుకోకూడదు. వాళ్ళందర్నీ క్షమించే గుణం తను పెంపొందించుకోవాలి. ఎందుకంటే ఇవన్నీ భగవంతుడు ఏర్పరచిన బంధాలు.

"రేపు వెళ్ళిపోతున్నాను" సౌపర్ణికి చెప్పింది.

"...మంచిదేలేండి. ఎంత ఎగిరినా పక్షి గూడు చేరాల్సిందే" సౌపర్ణి వేదాంత ధోరణిలో చెప్పింది.

మైత్రేయి నవ్వింది.

"నేను పారిపోయి రాలేదు. ఆత్మ పరిశీలనకోసం వచ్చాను. ఏకాంతం కోసం కూడా."

"మా ఊరు మీకు అందుకు సహాయం చేసిందని ఆశిస్తాను" సౌపర్ణి చక్కటి ఉచ్చారణతో చెప్పింది.

"చాలా. నేనేమిటో అర్థమైంది."

"అర్థం కాలేదు దీదీ. వెళ్ళాక ఆడపడుచుని ఇంటికి రావద్దంటావా? అత్తని ఆమెతో పంపేస్తావా?" సౌపర్ణి అమాయకంగా అడిగింది.

"అంటే నేను నేనుగా ఉండాలని. మైత్రేయిలా ఉండాలని తెలుసుకున్నాను. ఇంతకాలం నేను 'నన్ను' కోల్పోయాను. కేవలం ఎదుటివారికి అద్దంలా మాత్రమే జీవిస్తూ సగం జీవితం గడిపేసాను. మిగిలిన జీవితాన్ని నాకోసం జీవిద్దామని. అదే ఇంట్లో, అదే మనుషులతో కొనసాగుతాను. వసంతని, అత్తగార్ని ఏమీ అనను. గయ్యాళితనం నా స్వభావం కాదు. వాళ్ళకోసం నా ఒరిజినాలిటీని ఎందుకు పోగొట్టుకోవాలి? నా మంచితనాన్ని కూడా కొనసాగిస్తాను. కాని దాన్ని నా మీద స్వారీ చేయనివ్వను" మైత్రేయి చిరునవ్వుతో చెప్పింది.

"అంత ఇంగ్లీష్ నాకు రాదు దీదీ."

"సరే వదిలెయ్. ఇరవై రోజులు ఆదరించి కడుపు నింపావు నీకు నా థాంక్స్" చెప్పి తన చేతికి ఉన్న పెళ్ళి ఉంగరం తీసి సౌపర్ణి చిటికెన వేలికి పెట్టింది.

ఆ కానుకని చూసి సౌపర్ణి కన్నీళ్ళు పెట్టింది.

"ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్ళావు, ఎక్కడున్నావు అని అంకుల్‌జీ, అడగరా దీదీ? పిల్లలు ఏమంటారో" అనుమానంగా చెప్పింది.

"వాళ్ళు ఆ అర్హత కోల్పోయారు. నాకు సారీ చెప్పే ధైర్యం కూడా లేదు వారికి. ఏమీ అనరు, బాధపడకు. వాళ్ళకి అనే అవకాశం ఇవ్వను. మీర్జా గాలిబ్ ఏమన్నారో తెలుసా?"

"ఆయనెవరు?"

"మనం పుట్టకమునుపటి కవి.

'నాది చిన్నగూడు; నా జీవితపు గోడు

నాదు విషాదగాథ నాది కాదే!

"ఇకనించి  నేను బహువచనంకాదు. ఏకవచనమే"

అయోమయంలో సౌపర్ణి చిన్నకళ్ళు ఇంకా చిన్నవయ్యాయి.

నీరు నిండిన మైత్రేయి కళ్ళకి అవి చుక్కల్లా కనపడ్డాయి.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments